క్లుప్తంగా

14న జరిగే ధర్నాకు అనుమతి ఇవ్వండి



తెనాలిఅర్బన్: వార్డు సచివాలయాల్లో పనిచేసే హెల్త్ సెక్రటరీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల14న నిర్వహించనున్న రాష్ట్ర వ్యాప్త ధర్నాకు అనుమతి ఇవ్వాలని కోరుతూ జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, సబ్ కలెక్టర్ సంజనా సింహాకు ఆ సంఘ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. తెనాలి కొత్తపేటలోని రామకృష్ణ కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల వేదిక వద్ద జరిగిన కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.శ్యామ్, అసోసియేషన్ నాయకులు పి.శ్యామల, పి.సునీత, టి.అరుణ, బి.అనిత, ఎస్.సునీత, ఎం.వాణి, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు

- మృతుడి వేధింపులతో విసిగి అంతమొందించిన స్నేహితుడు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ



తెనాలి రూరల్: బుర్రిపాలెం రోడ్డు నుంచి పూలే కాలనీ టిడ్కో గృహాలకు వెళ్లే దారిలో ఈనెల 1వ తేదీ అర్ధరాత్రి దాటాక జరిగిన యువకుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. మృతుడి వేధింపులు భరించలేక స్నేహితుడే హత్యకు పాల్పడ్డాడు. తెనాలి రూరల్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలను డీఎస్పీ బి. జనార్దనరావు వెల్లడించారు. బుర్రిపాలెం గ్రామానికి చెందిన పేరిశెట్టి కోటేశ్వరరావు బుర్రిపాలెం రోడ్డు నుండి పూలే కాలనీ టిడ్కో గృహాలకు వెళ్లే దారిలో నిర్మానుష్య ప్రాంతంలో దారుణ హత్యకు గురయ్యాడు. దీనిపై ట్రైనీ డీఎస్పీ భార్గవి, రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హత్యకు పాల్పడింది కోటేశ్వరరావు స్నేహితుడు, సెల్‌ఫోన్ రిపేరు షాపు నిర్వాహకుడైన నాజరుపేటకు చెందిన షేక్ ఆదామ్ షఫీగా గుర్తించారు. మృతుడు కోటేశ్వరరావు, నిందితుడు ఆదామ్ షఫీ ఇద్దరూ స్నేహితులు. కోటేశ్వరరావు దగ్గర షఫీ గతంలో కొంత నగదు అప్పుగా తీసుకున్నాడు. ఈ క్రమంలో దాన్ని తీర్చే విషయమై తరచూ వీరి మధ్య ఘర్షణ జరుగుతోంది. మృతుడు కోటేశ్వరరావు, షఫీకి పదే పదే ఫోన్లు చేసి అప్పు తీర్చమని లేదంటే అతని భార్యను పంపమంటూ అసభ్యకరంగా మాట్లాడుతున్నాడు. దీంతో విసిగిపోయిన షఫీ అతడ్ని హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 1వ తేదీ రాత్రి మద్యం తాగుదామని చెప్పి బుర్రిపాలెం రోడ్డు లోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకు వెళ్లాడు. వెంట తెచ్చుకున్న బటన్ కత్తితో కోటేశ్వరరావు గొంతు కోసి హత్య చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును చాకచక్యంగా ఛేదించిన ట్రైనీ డీఎస్పీ భార్గవి, రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్. ప్రతాప్, హెడ్ కానిస్టేబుళ్లు ఎ. బాలాజీ, వి. రవి, డి. రవిలను డీఎస్పీ అభినందించారు.

పలువురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ

వేమూరు: వేమూరు మండలంలోని పలువురు గ్రామ పంచాయతీ కార్యదర్శులను బదిలీ అయ్యారని ఎంపీడీఓ బి.శివన్నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెనుమర్రు గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావును చుండూరు మండలంలోని చినగాదెలవర్రు గ్రామ పంచాయతీకి బదిలీ చేశారు. ఆయన స్థానంలో బలిజేపల్లి పంచాయతీ కార్యదర్శి నూతక్కి సింధూ పెనుమర్రు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. చావలి పంచాయతీ కార్యదర్శి గాజులు శ్రీనివాసరావును పెరవలి గ్రామ పంచాయతీకి బదిలీ చేశారు. చదలవాడ పంచాయతీ కార్యదర్శి షేక్ సాధీఖాన్‌ను కుచ్చెళ్ల పాడు గ్రామ పంచాయతీకి బదిలీ చేశారు. చదలవాడ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా అంజనేయులు ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. వరహాపురం పంచాయతీ కార్యదర్శి సుజాత పెరవలి పాలెం పంచాయతీ కార్యదర్శిగా బదిలీ చేశారు. ఆమె ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. వరహాపురం పంచాయతీ కార్యదర్శిగా గోపాల కృష్ణ బాధ్యతలు చేపట్టారు. జంపని పంచాయతీ కార్యదర్శి వివేక నంద్‌ను దుగ్గిరాల బదిలీ చేశారు. జంపని పంచాయతీ కార్యదర్శిగా షేక్ రహిమాన్ బాధ్యతలు చేపట్టారు.

సిబ్బందికి సన్మానం

పెనుమర్రు(వేమూరు) పెనుమర్రు గ్రామ సచివాలయం నుంచి బదిలీపై వెళ్లిన సిబ్బంది గ్రామ అభివృద్ధికి కృషి చేశారని గ్రామ సర్పంచ్ కొక్కిల గడ్డ సుమతి అన్నారు. వేమూరు మండలంలోని పెనుమర్రు గ్రామ సచివాలయంలో పనిచేసి బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వీఆర్‌ఓ గాజుల జితేంద్ర, ఎలక్ట్రికల్ అసిస్టెంట్ లైన్‌మెన్ పుసులూరు మనోజ్ కుమార్‌కు ఆమె సోమవారం సన్మానం చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

చోరులున్నారు.. తస్మాత్ జాగ్రత్త

- దసరా సెలవుల సందడిలో జనం
- చోరీ కోసం అదును చూస్తున్న దొంగలు
- ఊళ్లకు వెళితే తమకు సమాచారం ఇవ్వమంటూ పోలీసుల వినతి



కొల్లిపర: మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రజలు దొంగల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. దొంగలు, దారి దోపిడీ ముఠాలు పండుగల సెలవులను లక్ష్యం చేసుకుని, ఇళ్లలో ఎవరు లేని సమయంలో విలువైన వస్తువులను అపహరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తారని వారు చెబుతున్నారు. దసరా సెలవులు దాదాపు 10 రోజులకు పైగా వచ్చాయి. ఆర్థిక స్థోమత ఉన్నవారు ఇంట్లో సీసీ కెమెరాలు అమర్చుకుని వాటిని మొబైల్ యాప్‌తో అనుసంధానం చేసుకోవాలని సూచిస్తున్నారు. కుటుంబంలో ఎవరూ లేకుండా ఊర్లకు వెళ్లే వారు దగ్గర్లోని పోలీసులకు సమాచారం ఇవ్వాలని, బంగారం, నగలు, మనీ, విలువైన వస్తువులను ఇంట్లో ఉంచొద్దని, భద్రంగా ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలంటున్నారు. కొల్లిపర గ్రామంలో సోమవారం ఒక ఇంట్లో దొంగతనం జరగడంతో కొల్లిపర ఎస్ఐ పి.కోటేశ్వరరావు దొంగతనాలు జరగకుండా ప్రజలు ముందస్తుగా జాగ్రత్తలు పాటించాలని పలు సూచనలు తెలిపారు.

సమాచారం ఇవ్వండి



దసరా పండుగ, శ్రీ దేవీశరన్నవరాత్రుల సందర్భంగా 10 రోజుల పాటు వరుస సెలవులు రావడంతో అందరూ ఊర్లకు వెళ్తుంటారు. ఇటువంటి సమయంలో గ్రామాల్లో దొంగతనాలు జరిగే అవకాశాలు ఎక్కువ శాతం ఉంది. ఇటువంటి సమయంలో దొంగతనాలకు వచ్చే దుండగులు పగలు రెక్కి చేసి, రాత్రుళ్లు ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక చోరీలకు పాల్పడతారు. ఊరికి వెళ్లే ముందు ప్రజలు ఇంటి చిరునామా ఇస్తే వారు తిరిగి ఇంటికి వచ్చే వరకు ఆయా గల్లీలో పగలు, రాత్రి పోలీసుల నిఘా ఉంచటం జరుగుతుంది. ఎవరికైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే డయల్100 కు, లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. – ఎస్ఐ పి.కోటేశ్వరరావు, కొల్లిపర

పోలీసుల సూచనలు

- ఊరికి వెళ్లే ముందు స్థానిక పోలీస్ స్టేషన్‌లో అడ్రస్ ఇవ్వాలి, దీంతో ఆ వీధుల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తారు.
- ఎవరికైన రాత్రి సమయంలో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు, లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి.
- విలువైన బంగారం బ్యాంకుల్లో లేదా తమ వెంట తీసుకువెళ్లాలి.
- ఏదైనా అనుమానాస్పదంగా ఉంటే చుట్టు పక్కల వారిని గమనించి సమాచారం ఇవ్వాలి.
- ఇంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని దానిని మొబైల్ యాప్‌తో అనుసంధానం చేసుకోవాలి.



రామలింగేశ్వరపేటలో శ్రీ వైష్ణవీ దేవిగా..



దేవీచౌక్‌లో శ్రీ అన్నపూర్ణాదేవిగా...




శ్రీఅన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన శ్రీకన్యకాపరమేశ్వరి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆంధ్రా ప్యారిస్‌లో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వేర్వేరు ఆలయాల్లో అమ్మవారు వేర్వేరు అవతారాల్లో భక్తులను కనువిందు చేశారు.



తెనాలిలో శ్రీ రాజమాతంగీదేవిగా శ్రీరాజరాజేశ్వరి దేవి



నందివెలుగులో శ్రీరాజరాజేశ్వరి దేవిగా



తెనాలి మారిస్‌పేటలో శ్రీఅన్నపూర్ణాదేవిగా

ప్రజా సమస్యలకు సంతృప్తికరమైన పరిష్కారం

తెనాలిలో నియోజకవర్గస్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి



అర్జీలను తీసుకుంటూ సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్

తెనాలి: వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు దాఖలు చేసుకునే అర్జీలను నిర్ణీత గడువులోగా సంతృప్తికరమైన విధంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదికకు మంచి స్పందన లభించింది. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్, తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ అర్జీలను స్వీకరించారు. జిల్లా ఉన్నతాధికారులు ఇద్దరూ తెనాలి రావటంతో గుంటూరులో అర్జీల స్వీకరణ ఉండదని భావించిన పలువురు ఇతర ప్రాంతాల వారూ ఇక్కడకే వచ్చి తమ సమస్యలను మొరపెట్టుకున్నారు. మొత్తం 56 మంది అర్జీలను అందజేశారు. వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల్లో మున్సిపాలిటీ, రెవెన్యూ, పోలీసు శాఖలకు సంబంధించి 36 ఫిర్యాదులు అందాయన్నారు. పింఛన్లు, వ్యవసాయం, ఇటీవలి వరదలకు సంబంధించి సాయంపై మరో 26 ఫిర్యాదులు వచ్చినట్టు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని, ప్రజల సౌకర్యార్థం నెలకొకసారి నియోజకవర్గ స్థాయి, డివిజన్ స్థాయిల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు నియోజకవర్గ స్థాయి, డివిజన్ స్థాయిల్లో అందే ఫిర్యాదులను పీజీఆర్ఎస్ ఆన్‌లైన్‌లో నమోదు చేసి నిర్ణీత వ్యవధిలో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లా కలెక్టరేట్‌లో ఎనిమిది మంది సభ్యులతో కూడిన ఆడిట్ టీం వీటిని పరిశీలిస్తుందన్నారు. అర్జీదారునితో మాట్లాడారా, అర్జీదారు అడిగిన విధంగా వారి సంతృప్తి మేరకు సమస్యను పరిష్కరించారా లేదాని కమిటీ ఆరా తీస్తుందని చెప్పారు. అర్జీదారు సంతృప్తి చెందకపోతే సంబంధిత అర్జీని రీ ఓపెన్ చేస్తామన్నారు. ప్రజల నుండి అందిన ఫిర్యాదుల పరిష్కారానికి నిర్దేశిత సమయం ఉంటుందని, నిర్ణీత గడువు లోపు క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతగా పరిష్కరించాలన్నారు.

డీఆర్డీఏ పీడీ విజయ లక్ష్మీ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ అన్నపూర్ణ, తెనాలి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, డివిజనల్ పంచాయతీ అధికారిణి స్వరూప, సీడీపీఓ సునీత, ఏడీఏ ఉషారాణి, ఎలక్ట్రికల్ డి.ఇ చిరంజీవి, డీఎస్పీ జనార్దనరావు, ఏవో ప్రేమ్ సాగర్, బీసీ సంక్షేమ అధికారి బిక్షాలు, తెనాలి తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో అత్తోట దీప్తి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, కొల్లిపర తహసీల్దార్ సిద్ధార్థ, కొల్లిపర ఏవో వెంకటరావు, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు దేవాలయాల్లో మంత్రి మనోహర్ పూజలు



కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శటారు తీసుకుంటున్న మంత్రి మనోహర్ దంపతులు

తెనాలిఅర్బన్: పట్టణంలో పలు దేవస్థానాలు, ప్రాంతాల్లో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆయన సతీమణి డాక్టర్ మనోహరంలు ఆదివారం రాత్రి పాల్గొన్నారు. అమ్మవారికి పూజలు చేశారు. శివాజీచౌక్‌లోని శ్రీ కాళీమాత అమ్మ దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవాల్లో, బోసురోడ్డులోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో, డాంగేవారివీధి, మారీసుపేటలోని శివాలయాల్లో జరిగిన వేడుకల్లో వారు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో పలువురు నిర్వాహకులు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలి

ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి



మాట్లాడుతున్న పద్మావతి

కొల్లిపర: పంచాయతీ అభివృద్ధికి సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు కలసికట్టుగా ఉంటూ గ్రామ అభివృద్ధికి ప్రతి క్షణం కృషి చేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఆర్‌జీఎస్‌ఎ కార్యాచరణ ప్రణాళిక 2024–25 లో భాగంగా సోమవారం ఉపసర్పంచ్‌లకు, వార్డు మెంబర్లులకు సాధారణ పరిపాలపై అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో అధికారులు ఉపసర్పంచులకు, వార్డు మెంబర్లకు ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ యాక్ట్ 1994 ముఖ్య నిబంధనలు, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, లే అవుట్, బిల్డింగ్ ప్లాన్ నిబంధనలు, పంచాయతీ ఆస్తులు, వీధి దీపాలు, విద్యుత్ బిల్లుల నిర్వహణ, పంచాయతీలో ఆర్థిక నిర్వహణ, గ్రామాలల్లో అక్షరాస్యత, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సామాజిక సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపిర్డీ భార్గవ, వివిధ గ్రామ ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

గోవులను రోడ్లపైకి వదిలితే చర్యలు

రేపల్లె రూరల్: రహదారులపైకి గోవులను వదిలే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. రహదారులపైకి ఆవులు రావటంతో ట్రాఫిక్‌తోపాటు పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోందన్నారు. గోవులు ప్రమాదాల బారిన పడుతున్నాయని, గోవులు రహదారిపైకి వస్తే మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గోశాలకు తరలిస్తామని యజమానులను హెచ్చరించారు. పలువురు యజమానులకు నోటీసులు జారీ చేశారు.

ప్రతి రైతుకు వరద పరిహారం అందించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందించి సమస్యలు వివరిస్తున్న సాంబిరెడ్డి

తెనాలిరూరల్: పంటనష్టం నమోదు కాని నేలపాడు తదితర రైతులకు పరిహారం మంజూరు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్‌రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి నాయకత్వంలో కౌలు రైతులు, రైతులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మహిళా పాడి రైతులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని, అన్నవరపు లంకకు చెందిన రైతు, కౌలు రైతులు, డ్వాక్రా రుణాలు రద్దు చేసి తిరిగి కొత్త రుణాలు ఇవ్వాలని, వరదకు పాడైపోయిన మోటార్లు మరమ్మతులు చేయించాలని, పథకంనకు రూ.3 కోట్లు నిధులు మంజూరు చేయాలన్నారు. కోల్డ్ స్టోరేజ్‌లో దగ్ధమైన పసుపు పరిహారం వెంటనే ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. రుణాలు రీ షెడ్యూలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని, మోటారు రిపేర్లకు ఆదేశాలు ఇస్తాంఅని చెప్పారు. మెప్మా ద్వారా బ్యాంకు రుణాలు ఇప్పించాలని ఎంపీడీవో తెలిపారు. హైలెవల్ ఛానల్, పసుపు రైతుల సమస్యలపరిశీలనలో ఉందని చెప్పారు. పిరాటి అప్పారావు, తోట శ్రీధర్, తెనాలి ఏసుమణి, కమలమ్మ, టి.ఏడుకొండలు పాల్గొన్నారు.

కొల్లిపరలో నగదు చోరీ



రామిరెడ్డి ఇంట్లో నగదు పోయిన బీరువాను పరిశీలిస్తున్న ఎస్ఐ కోటేశ్వరరావు

కొల్లిపర: మండల కేంద్రంలో ఓ ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి లక్ష రూపాయలు నగదు చోరీ చేసిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కొల్లిపర గ్రామానికి చెందిన గుడిబండి రామిరెడ్డి ఇంటికి తాళం వేసి తన కుటుంబసభ్యులతో కలసి శనివారం హైదరాబాద్ వెళ్లి తిరిగి సోమవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగల గొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాల్లో పిల్లల చదువు కోసం పెట్టిన లక్ష కనిపించక పోవటంతో వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ పి.కోటేశ్వరరావు సంఘట స్థలాన్ని పరిశీలించి రామిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ పండుగ సమయంలో ఎవరైన కుటుంబసభ్యులు అందరూ కలసి ఇతర గ్రామాలకు వెళ్లే సమయంలో స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే అటు వంటి గృహలపై పోలీస్ సిబ్బంది రాత్రి సమయంలో నిఘా ఉండటం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైన ఇటువంటి సమయంలో తప్పకుండా ప్రజలు అప్రమత్తంగా ఉంది. పోలీసులకు ముందుగానే సమాచారం ఇవ్వాలని, అప్పుడే దొంగతనాలు అరికట్ట వచ్చునన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

భట్టిప్రోలు: ఇటీవల కురిసిన అధిక వర్షాల వల్ల మగ్గాల గుంతల్లో నీరు చేరి ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు జి.బాలాజీ, ఎం.సత్యనారాయణలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భట్టిప్రోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద చేనేత కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు బాలాజీ, సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులకు మంగళగిరి తరహాలో ఆర్థిక సహాయం నిత్యవసర సరుకులు అందించి ఆదుకోవాలని కోరారు. నేతన్నలు 20 రోజులకుపైగా పనులు లేకపోవడంతో రోజులు గడవక, కష్టాలను ఎదుర్కొవడంతోపాటు ఆర్థికంగా, తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. బాపట్ల జిల్లాను ముంపు జిల్లాగా ప్రకటించిన ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవడంలో ఎందుకు తాత్సారం చేస్తుందని ప్రశ్నించారు. తక్షణమే నేతన్నలకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎస్వీ రమణలకు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘాల నాయకులు డి.సత్యనారాయణ, బి. నాగ మల్లేశ్వరరావు, కె.రామకోటేశ్వరరావు, డి.సాంబశివరావు, జె. నాగభూషణం, కె.చలపతిరావు, ఎ.శ్రీనివాసరావు, లక్ష్మీకాంతారావు, రామ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో 15 మంది ఎంపిక



తెనాలిఅర్బన్: బెంగుళూరుకు చెందిన క్యూ స్పైడర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఎన్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో 15 మంది ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. విద్యార్థులకు వ్రాత పరీక్ష, గ్రూప్ డిస్కర్షన్‌లను నిర్వహించి వాటిలో మంచి ప్రతిభ చూపిన వారిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరిని కళాశాల ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో సంస్థ హెచ్ఆర్‌లు సృజన, శ్రీలేఖ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ విబిఎన్ అజయ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డీఎస్ గోపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మండల మహిళా కార్యాలయం మూత



వేమూరు: ఆదర్శ మండల మహిళా కార్యాలయం మూతపడింది. ఈ కార్యాలయంలో ఐదుగురు ఉద్యోగులు ఉండాలి. ఏపీఓ, ముగ్గురు సీసీలు, అకౌంటెంట్ విధులు నిర్వర్తిస్తారు. సోమవారం ఈ కార్యాలయం మూతవేశారు. డ్వాక్రా గ్రూపుల సభ్యులు వచ్చి తిరిగి వెళ్తున్నారు. ఏపీఎం శోభన్‌బాబును వివరణ కోరగా సిబ్బంది కొరత వల్ల మూత వేసినట్టు చెప్పారు.

తెనాలి విద్యార్థుల ప్రతిభ



తెనాలిఅర్బన్: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో తెనాలిలోని రావి సాంబయ్య మున్సిపల్ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొనట్లు ప్రధానోపాధ్యాయురాలు షేక్ మౌలాబి తెలిపారు. పోటీలను కర్నూలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాలలో ఆది, సోమవారాల్లో నిర్వహించినట్లు చెప్పారు. బాలికల విభాగంలో ఆకురాతి నవ్యశ్రీ, ధనాల తనుశ్రీ, పెనుమూడి బ్యూలా, బత్తిన నాగహారిక, సంపతి జ్యోత్స్న ప్రియ, బాలుర విభాగంలో షేక్ బుజ్జి, షేక్ మహమ్మద్ ఇలియాస్, దాసరి షణ్ముఖ శివ, ముప్వా శివశంకర్, కొమరగిరి శివయ్యలు పాల్గొన్నట్లు చెప్పారు. వీరందరికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేసినట్లు వివరించారు.